## కామెడీ కథ

# బకరా

**సురేంద్రకి కోపంగా ఉంది. ఒళ్ళంతా కారం రాసుకున్నట్టు అస్థిమితంగా ఉంది. పిచ్చి పిచ్చిగా, గజిబిజిగా ఉంది.**

**ఆదివారం ఆనందం అంతా ఆవిరైపోతోందన్న ఆక్రోశం..ఉక్రోశం. ఇంకొక్క క్షణం ఇంట్లో ఉన్నా ఎండాకాలమే వాళ్ళింట్లోంచి దీపావళి ధమధమలు, మెరుపులు, నిప్పురవ్వలు వెలువడడం ఖాయం.**

ఎర్రలైట్‌ని గుర్తించిన సురేంద్ర ముందుచూపుతో ఇంట్లోంచి బయటపడ్డాడే కానీ ఎక్కడికి వెళ్ళాలో తెలియలేదు.

"ఆదివారమా?..ఇది కాదు..ఆపదలవారం" అని టీవీ సీరియల్ సాంగ్ స్టైల్లో గట్టిగా పాడాలనిపించింది. రోడ్డు మీద ఉన్నానన్నది గుర్తుకొచ్చి నోరు మూసుకున్నాడు. నోరు తెరిస్తే ఇంకో ఆపద నెత్తిమీద పడుతుంది. ఏ దారినపోయే దానయ్యో సోషల్‌వర్క్ చేస్తున్నాననుకుని ఏ పిచ్చాసుపత్రిలోనో చేర్చేసే ప్రమాదం ఉంది.

'ఎక్కడికీ పయనం?..ఏదీ గమ్యం..' అని ఆలోచిస్తుండగా అనంత్ గుర్తుకొచ్చాడు. అంతే...అరగంటలో అనంత్ ఇంటిముందున్న కాలింగ్ బెల్ నొక్కాడు.

విసుగ్గా డోర్ తెరచిన అనంత్ మరింత విసుగ్గా తన నెత్తిమీదే గంట పెట్టి మరీ కొట్టినట్టు గంటు మొహం పెట్టాడు.

'ఫ్రెండా..వీడు..కాదు..ఎనిమీ' మళ్ళీ పాట నోట్లోంచి రాబోతూంటే బలవంతాన నోటిని నొక్కేశాడు. ఛీ..సినిమాల్లో పాటలు బేన్ చేయాలి.

'రా' అంటే ఎక్కడ లోపలికి వచ్చేస్తాడో అన్నట్టు రెండు చేతులు గుమ్మానికి రెండు వైపులా అడ్డంగా పెట్టి నుంచున్న అనంత్‌ని చూసి 'ఛీ..మిత్రద్రోహి' అనబోయి వాడికి పెళ్ళయి ఆరువారాలు మాత్రమే అయిందన్నది గుర్తుకొచ్చి ఆగిపోయాడు. బిడియపడిపోయాడు.

'ఛీ..వెధవ బుర్ర. బెల్ కొట్టకముందే ఈ విషయం ఎందుకు గుర్తురాలేదు' తన బుర్రమీదే ఒక్కటిచ్చుకున్నాడు సురేంద్ర.

"ఏనీ ప్రాబ్లెం" అనంత్ అడ్డంగా నుంచునే ఎంక్వైరీ చేశాడు.

"ఒళ్ళంతా మండిపోతోంది.." సురేంద్ర అక్కడ నుంచునే తన కష్టం చెప్పుకుందామనుకున్నాడు.

"ఎండా కాలం మరి.." అనంత్ సురేంద్రని మాట్లాడనివ్వకుండానే కారణం కనిపెట్టేసినట్టు ఫోజు కొట్టాడు. "మా ఇంట్లో ఇవాళ పంపురాలేదు. ఇంట్లో నీళ్ళ చుక్క లేదు."

సురేంద్ర ఒళ్ళుమంట మరింత పెరిగింది.

"అన్నయ్యగారూ..మీరా..రండి..రండి.. అలా గుమ్మంలోనే నిలబడిపోయారేం.." వాసవి ఇంట్లోంచి బయటికి వస్తూ అంది.

'మీ ఆయన అడ్డం తప్పుకుంటే..' లోలోపలే అనుకున్నాడు సురేంద్ర. అప్పుడైనా అనంత్ గుమ్మానికడ్డంగా ఉన్న చేతులు తీస్తే కాస్సేపు కూర్చుని సేద తీరాలనుకున్న సురేంద్ర ఆశ అడియాసే అయింది.

"వసూ...ఇవ్వాళ ఆదివారం..లత స్పెషల్ లంచ్ తయారు చేసి వీడికోసం చూస్తూ ఉంటుంది. ఆలస్యం మనవల్ల అంటే మనల్ని తిడుతుంది" అనంత్ అడ్డంగా నుంచునే వాసవికి సురేంద్ర తరపున జవాబిచ్చేశాడు. సురేంద్రకి వెనక్కి తిరక్క తప్పలేదు. ఉస్సురంటూ రోడ్డెక్కాడు.

'కొత్త బిచ్చగాడు..ఎంత కొత్తగా పెళ్ళయితే మాత్రం..క్లోజు ఫ్రెండునన్న ఇంగితం ఉండద్దూ..' సురేంద్రకి ఒళ్ళు మండిపోతోంది.

పొద్దుట్నించీ కడుపులో ఏం పడక కడుపులో మంట..కడుపు ఆకలితో నక నక లాడుతోంది. ఒళ్ళంతా చిర చిర లాడుతోంది.

ఆత్మారాముడినైనా చల్లపరుద్దామని హోటల్ 'స్వాగత్'లో అడుగుపెట్టాడు.

"రండి..రండి" స్వాగత్ హోటల్ వాళ్ళు తమ పేరు సార్థకం చేసుకోవాలనుకుంటున్నారో ఏంటో ఇద్దరు స్మార్ట్‌గా ఉన్న చాకుల్లాంటి కుర్రాళ్ళు నోరంతా పళ్లు కనిపించేలా ఇకిలిస్తూ ఎదురొచ్చారు.

'మీరు స్వాగతం చెప్పకపోయినా వస్తాను. కడుపు కాలుతోంది' సురేంద్ర లోపలే అనుకుంటూ పైకి చిరునవ్వు చిందించాడు.

"సార్..ప్లీజ్..ఒక్క మాట..ఒక్కసారి కాస్త పక్కకి వస్తారా" ఎర్ర టై, నల్ల సూటు కుర్రాడు గుసగుసగా అన్నాడు.

"సార్..ఆ మూల చూడండి..ఎర్రచీర కట్టుకున్న ఆవిడ ఉంది చూశారూ..ఆవిడే మా ఆవిడ" అటు చూసిన...సురేంద్ర ఖంగుతిన్నాడు.

హోటల్ భోజనాల హాల్ నలుచదరంగా చాలా పెద్దదిగా ఉంది. భోజనాల సెక్షన్ పదకొండు నుంచి మూడు వరకూ..పదకొండు కొట్టడానికి ఇంకా పది నిముషాలు ఉంది. అందుకే అంత పెద్దహాల్లో ఒకళ్ళిద్దరు తప్ప ఎక్కువమంది లేరు.

"పొద్దున్నే ఇంట్లో ఏదో చిన్న దెబ్బలాట. అలిగి వచ్చేసి ఇక్కడ భోజనానికి ఆర్డరిచ్చింది. భార్యాభర్తలన్నాక చిన్న చిన్న పొరపొచ్చాలు రాకుండా ఉంటాయా? ప్లీజ్ మీరు కాస్త ఆవిడకి నచ్చచెప్పి ఈ లెటర్ ఇవ్వరూ.."

సురేంద్ర ఎర్రచీర ఆవిడవైపు పరీక్షగా చూశాడు. ముక్కు చీదుతోంది ఆవిడ మాటి మాటికీ.

"మొగుణ్ణి కొట్టి మొగసాలకెక్కిందని అన్నట్టు చూడండి. ఇక్కడకొచ్చి అందరిలో పరువుపోయేట్టు కళ్ళనీళ్ళు పెట్టుకుంటోంది."

"జలుబయ్యా...." సురేంద్రని మాట్లాడనివ్వలేదు ఎర్రటై కుర్రాడు.

"అబ్బే కాదండీ...మా ఆవిడ కిలాడీ మీకు తెలియదు" లెటర్ అందిస్తూ అన్నాడు. 'మా ఆవిడ కిలాడీ' బావుంది. ఏ డైరక్టరో..ప్రొడ్యూసరో వింటే ఆ పళంగా ఈ టైటిల్‌ని అంది పుచ్చుకుని ఓ సినిమాకి శ్రీకారం చుట్టేసి ఉండేవాళ్ళు.

"లవ్ లెటరా.."

"కాదండీ..క్షమించమని.. మీరు చూడండి తప్పేం లేదు"

'చూడకుండా ఎలా ఇస్తాను..' సురేంద్ర లోపల అనుకుని నాలుగు మడతలు పెట్టిన కాగితాన్ని విప్పి చూశాడు. "ఐయామ్ సారీ" అని డయాగ్నల్‌గా పెద్ద పెద్ద అక్షరాలతో రాసి ఉంది.

'యూ ఆర్ గోయింగ్ టు బి సారీ' సురేంద్ర ముసి ముసిగా నవ్వుకున్నాడు. "సరే..నేను మీడియేటర్‌గా ఉంటాను. మరి నా లంచ్ బిల్ మీరే పే చెయ్యాలి."

"తప్పకుండా..ష్యూర్..వైనాట్..మీరు మాకింత హెల్ప్ చేస్తూంటే.."

తెల్లసూటు..నల్లటై కుర్రాడు తెగ సంబరపడిపోతూ అన్నాడు.

"ఆ ఎర్రచీర ఆవిడది కూడా.."

"అదెలాగూ తప్పదు..మేము కాస్త అదుగో ఆ స్క్రీన్ వెనక నుంచి చూస్తూ ఉంటాం మరి..బెస్టాఫ్ లక్.."

**చిట్టిపెద్ది ఉమ**



'చూడండి తమాషా..' సురేంద్ర స్వగతంగా అనుకుంటూ ఎర్రచీర ఆవిడ వైపు నడిచి లెటర్ అందించాడు.

ఎర్ర టై, నల్ల టై వాళ్ళ వైపు ఆతృతగా చూస్తున్నారు.

సురేంద్ర లెటర్ అందుకున్న ఆవిడ కళ్ళు మెరిసాయి. ఇద్దరూ ఒకళ్ళ చేతులు ఒకళ్ళు పట్టుకుని తెగ ఇదైపోయారు. బేరర్ సూప్ తెచ్చిపెట్టాడు వాళ్ళ ముందు. ఓ స్పూన్ సురేంద్ర ఆవిడ నోటికి అందిస్తే ఆవిడ సురేంద్రకో స్పూన్ సూప్ అందించింది. మురిసిపోతూ కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళని చూసి ఎర్ర టై, నల్ల టైలకి మతిపోయింది. "డామిట్...కథ అడ్డం తిరిగింది."

రూమ్‌లో నక్కి ఉన్న వాళ్ళ మనుష్యులకి సైగలు చేసి తలలు పట్టుక్కూర్చున్నారు తెల్లసూటు, నల్ల సూటు కుర్రాళ్ళు.

సురేంద్ర, ఎర్రచీర ఆవిడా కబుర్లు చెప్పుకుంటూ ఒకళ్ళ నోటికి ఇంకోళ్ళు ముద్దలు అందించుకుంటూ, మురిసిపోతూ భోజనం కానిచ్చి బిల్లు వచ్చినప్పుడు ఎర్ర టై వైపు చూపించారు.

"తప్పుతుందా.." ఎర్రటై ఉస్సురంటూ బిల్ పే చేశాడు.

"చాలా థాంక్సండీ.. ఈవిడే మా ఆవిడ" సురేంద్ర నవ్వుతూ ఎర్రటై, నల్లటై లకి ధన్యవాదాలు చెప్పాడు. పళ్ళు పటపట లాడిస్తూ పైకి మాత్రం ఓ ఏడుపులాంటి నవ్వు విసిరారు ఎర్రటై, నల్లటై. తెలుగువన్ టీవీకి అతి తెలివిగా ఓ 'బకరా'ని పట్టుకుని కాస్సేపు సరదాగా షూట్ (సీనే లెండి) చేసి అఖిలాంధ్ర జనాలమీదకి వదుల్దామనుకున్న వాళ్ళ తెలివి బెడిసి కొట్టి బిల్లు మాత్రం చేతికొచ్చింది.

సురేంద్ర లెటర్ ఆవిడకిస్తాడు. నచ్చచెప్పాలని చూస్తాడు. ఆవిడ చెడామడా విదిలిస్తుంది. ఇద్దరూ గొడవపడ్తారు. భలే సరదా 'ఎపిసోడ్' తయారవుతుంది అనుకున్న వాళ్ళకి తీరని ఆశాభంగం.

వాళ్ళని బకరాలని చెయ్యాలనుకుని మనమే 'బకరా'లమయ్యామని వాపోయారు తెల్లసూటు, నల్ల సూటు.

"చాలా థాంక్సండీ. ఆదివారం భలే సరదాగా, థ్రిల్లింగ్‌గా స్టార్టయింది. కానీ మీ ప్రోగ్రాంకి 'హుష్' అని కాక 'తుస్' అని పెట్టుకోండి.." లత ఓ ఉచిత సలహా ఇచ్చింది స్మార్ట్ కుర్రాళ్ళకి.

"థాంక్ గాడ్..ఈ ఇడియట్స్ (ఇడియట్ బాక్స్‌లో పని చేసేవాళ్ళు) లేకపోతే పొద్దున్నే లతతో పడ్డ గొడవ..ఎన్నాళ్ళు మాటలు లేకుండా లాగేదో..ఇద్దరికిద్దరే నేను 'సారీ' చెప్పేది లేదంటే నేను చెప్పను అని బిగుసుకు కూర్చున్నారు. కాగల కార్యం గంధర్వులు తీర్చారు అన్నట్టు వీళ్ళ పుణ్యమాని సమస్య తేలిపోయింది. టీవీ కాపురంలో నిప్పులు పోస్తోంది అని ఆడిపోసుకుంటున్నారు కానీ టీవీ కాపురాలు నిలబెడ్తోంది కూడా" ఆర్నెల్ల క్రితమే పెళ్ళయిన కొత్తదంపతులు లతా, సురేంద్ర చేతులు పట్టుకుని జాలీగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళిపోతూంటే నిస్సహాయంగా చూసి కొత్త 'బకరా'ల వేటకి రోడ్డుమీద పడ్డారు ఎర్రటై, నల్లటై..నల్లసూటు, తెల్లసూటు కుర్రాళ్ళు తమ బలగంతో.